శ్రీ వాడపల్లి లక్ష్మీనారాయణాచార్యులు

ఇంటికి వెళ్ళిపోదాం

నీరెండలో డాబామెట్లమీద కూర్చుని శ్రీనాథూ శేఖరూ లెక్కలు చేసుకొంటున్నారు. వాళ్ళకి కొంచెం దిగూ మెట్టుమీద వాణి కూర్చుని, కొండపల్లి బొమ్మల్నీ సంసారం లక్కపిడతల్నీ పేర్చుకొని ఆడుకొంటోంది.

పేపరు చదువుకొంటున్నవాడినల్లా "యేం! యెదవా—మళ్లీ పలకొత్తు! తన్నేత్తానంతే" అన్న వాణి మాటలు విని మెట్లమీదికి దృష్టి మళ్లించేను. అప్పటికే వాణి శ్రీనాథ్ దగ్గిరకి వెళ్ళడం, వాడిమీద వో చిన్న చఱుపు చరుస్తూ "మరి నా బొమ్మ లెందుకు పలగొత్తాలి?" అని అనడం — అయిపోయి; తిరిగొచ్చి పడిపోయిన బొమ్మల్ని సర్దుకొంటోంది. నిల్చోబెట్టిన చెవులపిల్లీ, గొల్లభామా అటూ ఇటూ తల లాడిస్తుంటే శేఖర్ వాటివైపే అలా చూస్తున్నాడు. శ్రీనాథ్ మళ్లా సందుచూసి మెల్లిగా వో నోట్సు పుస్తకాన్ని బొమ్మల పైకి విసిరి, నంగనాచిలా రాసుకొంటున్నాడు. "యేంరా దొంగ యెద్దవా.. వుండు నీ పని అమ్మతో సెపతాను" అని వాణి అంటూనే లేచి పుస్తకాన్ని శ్రీనాథ్ పైకి గిరాటెట్టి; "అస్సలు నేనాలుకోనే ఆలుకోను! ఛీ!" అంటూ మిగతా బొమ్మల్ని కూడా కాలితో తోసేసింది! వాణిఅన్న మొదటి వాక్యంతో బొమ్మల మీదనున్న శేఖర్ దృష్టి చెదిరి వాణిపై నిలిచింది! శూన్య దృక్కులతో తదేకంగా దాన్నే చూస్తున్నాడు. నీరెండలో వాడి కళ్ళు చూడ్డాని కదోలా వున్నాయి!

ఇంతట్లోనే వాణి కళ్ళని మిలమిలా ఆడిస్తూ "సెప్పన్లే" అని హుందాగా అని; "మరేం—నాకా నెమలికన్ను యిచ్చెయ్యరా!" అంటూ తాను గిరాటెట్టిన నోట్సులోంచి జారిన నెమలి కన్నును అందుకోబోయింది. కాని; శ్రీనాథ్ ముందే అందుకొని మేడమీదికి దౌడు తీసేడు. "వ్వాలే అన్నయ్యా నా కిచ్చేయలా అది! ... మరి నువ్వు లేపు తెచ్చినప్పలే నాకిచ్చేత్తానన్నావు కదేంతిరా!" అంటూ వాణి వాడి వెనక పరుగెడుతోంది. దాన్ని పరిగెత్తించి పరిగెత్తించి; వొక్కసారి తను ఠక్కునఆగిపోయి, నెమలికన్నువున్న చేతినిపైకెత్తి "అందుకో ఇచ్చేస్తాను" అన్నాడు శ్రీనాథ్. మెల్లిగా వాడి వెనకనుంచి డేకుతూ వెళ్ళిన శేఖర్ చటుక్కునలేచి వొకచేత్తో శ్రీనాథ్‌ని కదలకుండా చుట్టేసి; రెండో చేత్తో నెమలి కన్నువున్న చేతిని బలవంతంగా దిగూకి వాణి కందేలా దించి "ఎందుకురా నా చిట్టి చెల్లిని ఏడిపిస్తావ్? — వాణీ అంటే మా చిన్నారి బంగారితల్లి — ఏమ్మా కదూ!" అంటూ వాణి నెత్తుకున్నాడు.

ఇంతలో ఇంట్లోంచి "రిక్షా వొచ్చే వేళైంది. కుఱ్ఱాళ్ళని అన్నాలికి రమ్మనండి" అన్న నా భార్య మాటని వాళ్ళ కందించి; మళ్ళా నేను పేపర్లో పడ్డాను.

మేడ దిగి ఇంట్లోకి వొస్తూనే శ్రీనాథ్ "నాన్నా! ఇవాళ కూడా శేఖర్ స్కూలికి రాట్ట!" అన్నాడు. "శేఖరేవిఁటి అన్నయ్య అనలేవూ? ఎన్నిసార్లు చెప్పేనలా పేరు పెట్టి పిలవద్దని!—నువ్వెళ్ళి భోంచేస్తూండు వాడూ వొస్తాడు" అన్నాను. వాణిని మెట్లు దించి, బొమ్మల్ని దాని ముందర పేరుస్తున్న శేఖర్ని పిలిచి "జ్వరం తగ్గిపోయింది కదా వెళ్ళడానికేంరా!" అన్నాను చేతిని పట్టుకొని పరీక్షిస్తూ.

"ఉట్టినే—రేపట్నించీ వెళతాను" అన్నాడు క్రిందికిచూస్తూ.

"ఉట్టినే ఎందుకు చెప్పు స్కూలు మానేయడం? వొంట్లో బాగులేకపోతే యెలాగూ తప్పదు. ఇప్పటికే వారంపైగా వెళ్ళలేదు. ఏ సబ్జక్టులోనన్నా వెనకబడితే దాన్ని కవర్ చేసుకోడం యెంత కష్టమని!—వెళ్ళిరా నామాట విని. నేను మీ క్లాస్ టీచర్‌కి లెటర్ రాసిస్తానుగా ఇన్నాళ్ళూ వొంట్లో బాగోలేదని. ఏం! అది కాదు—చూడిలా!—ఎందుకు వెళ్ళవో నాకు చెప్పడానికేం?" అన్నాను తటపటాయిస్తున్న శేఖర్‌తో.

"ఇవాళ నాన్న దగ్గిర్నుంచి వుత్తరం వొస్తుందని" — నానుంచి చూపు మళ్లించుకొంటూ అన్నాడు. కళ్ళలో కొంచెంగా నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి.

వంటింట్లోంచి "నెల క్రితం నుంచీ రాని వుత్తరం ఇవాళొస్తుందిట్రా నీ పిచ్చిగాని!" అంది నా భార్య.

"బాగుంది! ఇన్నాళ్ళూ రాలేదు గాబట్టి ఇవాళకూడా రాదని ఏం చెప్పగలం కాని! .. నాక్కూడా వడ్డించు. వీడి మాష్టారికి రెండు ముక్కలు రాసి వొచ్చేస్తున్నా" అని; శేఖర్‌తో "వుత్తరం కోసం స్కూలుమాని కూర్చోడమెందుకురా. ఉత్తరం వొస్తే అలాగే వుంచుతాను. సాయంత్రం నువ్వే చదివి వినిపిద్దుగాని—ఏం—వేగిరం భోంచేయి మరి రిక్షా వొచ్చేస్తుంది" అని వాడిని లోపలికి పంపించి; ప్లేంక్ తీసుకొని లెటర్ వ్రాస్తున్నాను.

వాణి బొమ్మలన్నిటినీ మెల్లిగా ఇంట్లోపెట్టి "నాన్నా మరేం ఐూ నెవిఁలీక ఈ బొమ్మ తలకి కత్తు నాన్నా— ఇంచక్కా యెంతో బావుంతాది" అంటూ వో చిన్నదారం ముక్కా, నెమలి కన్నూ, గొల్లభామ బొమ్మా ప్లేంక్‌మీద పెట్టింది.

''అదెలా కట్టనమ్మా?! దీని తల నున్నగా బోడిగుండులాగా వుంది. దారం కడితే మొహం మీదికి వొస్తుంది. అసలు బిగవదు. జారిపోతుంది. అలాగే ఆడుకొందూ – రాత్రి ఈకల ఆల్బంలో గుచ్చుకొందాంలే.''

''నే పెడతాను వే'' అంటూ అన్నం తింటున్న శేఖర్ పిలిచేడు.

కాగితాన్ని రాసి పుస్తకాల బాక్సుమీద పెట్టి భోజనానికి వెలుతుంటే వాణి మహదానందంతో ఎదురుగావొచ్చి ''నీకేం తెలీదు నాన్నా, పెద్దన్నయ్య చూడు ఎంచక్కా ఎంత బాగా అంతించేడో!'' అంది బొమ్మని చూపిస్తూ. గొల్లభామ నెత్తికి వెనకగా కొంచెం ప్రక్కన నెమలికన్ను పెట్టి దాని పైనుంచి బొమ్మకి ట్రాన్స్పరెంట్‌గా వున్న వో చిన్న స్టికర్ ముక్కని బిగుతుగా అంటించేడు బొమ్మ తల పంకిస్తుంటే నెమలి కన్నుకూడా తలతోకలిసి వూగుతూ గొప్ప అందంగా వుంది. వీడికి ఎంత వేగిరం ఐడియా తట్టింది – అనుకొంటూ ''ఈ స్టికర్ ముక్క ఇప్పటి కిప్పుడెలా వచ్చిందిరా'' అన్నాను పీటపై కూర్చొంటూ.

''ఆమధ్య మీరు పళ్ళపొడి సీసా కొన్నారు కదా. దాని అట్టపెట్టికి సీల్‌చేసివుంటే ఉట్టినేతీసి గుమ్మానికి అంటించివుంచేను'' అన్నాడు లేచి చేతులు కడుక్కొంటూ.

వీధి గుమ్మంలోంచి ''అబ్బాయిగారూ'' అన్న రిక్షావాడి కేక విని బెల్టు బుజాన వేసుకొని, బూట్లు వో చేత్తోనూ, పుస్తకాల బాక్స్ మరో చేత్తోనూ పట్టుకుని గుమ్మం దగ్గిరికి కుర్రాళ్ళు పరిగెత్తేరు. నా భార్యా, వాణీ టిఫిన్‌కారియర్లని పట్టుకు వీధిగుమ్మంలోకి వెళ్ళేరు.

''ఎలేం అన్నయ్య ఎప్పలూ నన్నేలిపిస్తాడే అమ్మా. మలి నేను వాలికి తాతా సెప్పను.''

''చెప్పాపోతే మానీ–సాయంత్రం సర్కస్‌కి నిన్ను తీసుకువెళ్ళనంతే'' అన్నాడు బెల్టు బిగించుకొని బూట్లు కట్టుకుంటూ.

''అమ్మా సలకసుకి నేనూ లావద్దే'' అంది జాలి కళ్ళతో బుంగమూతితో.

''వుత్తిదేనమ్మా నువ్వు రాకపోతే ఏనుగులూ, కుందేళ్ళూ వాడిని గేటుదగ్గిరే అడ్డేసి లోపలికి వెళ్ళనీయవంతే'' అంది రిక్షాలో కెక్కిన కుర్రాళ్ళకి బాక్సుల్ని అందిస్తూ.

''పెద్దన్నయ్యా తాతా...అన్నయ్యా తాతా.''

అన్నం తింటున్నవాణ్ణల్లా ఠక్కున వెనక్కితిరిగి శేఖర్‌వైపు చూసేను! చేతినూపే వాడి కళ్ళలో మెఱుస్తున్న సంతృప్తి నా కళ్ళబడి వొక్కసారిగ చలించిపోయేను. సాయంత్రపు నీరెండపోయి, వెన్నెల రాడానికి ముందర – నీలాకాశంలో నూత్న కాంతితో మెఱిసే నక్షత్రాల్లాగా వున్నాయి వాడి కళ్ళు!

''డాక్టరుగారేవంన్నారండి?'' అంది మజ్జిగపోస్తూ నాభార్య.

''ఏమంటారు అసలు వాడికి డిసీజంటూ వుంటే కదా!.. వాడికి తల్లిదండ్రులమీదా తోబుట్టువులమీదా వుంది మనసంతా!... ఈ సంగతులేవీ మా అన్నయ్యలుంగారి కర్థం కావు. అయితే పరిస్థితులు కూడా అలాగే వొచ్చేయనుకో.'' అన్నాను లేస్తూ.

''పరిస్థితులేవిటండీ ... కుర్రాళ్ళు దగ్గిరున్న కొద్దిపాటి రోజుల్లో కూడా వాళ్ళిద్దరికీ తమ తమ ఆనందాలు తప్ప వీళ్ళ గొడవ అస్సలు పట్టదు గదా! ఇంట్లో పిల్లల్ని వుంచి తలుపులికి తాళాలేసుకొని ఎంచక్కా ఎవరి మట్టుకువారు సినీమాలకనీ షికార్లకనీ వుడాయిస్తారు. రాత్రి యెనిమిదవకుండానే పిల్లల్ని ఎలాగోలాగు పడుకోబెట్టేసి ఇంట్లోనే తాగి తందనాలాడతారు'' అంది కిళ్ళీ చుట్టి అందిస్తూ.

''అవన్నీ అలా వుండనీ, కనీసం వారానికో పక్షానికో వో కార్డుముక్కన్నా వాడిపేర రాసి పడేయడానికి వాడికి వీలుచిక్కడం లేదా అని?! నేను ఎప్పటినుంచో శేఖర్ని తెగస్టడీచేసి చూస్తున్నాను. మన పిల్లలపై మనం మనకే తెలీకుండాచూపే వాత్సల్యాభిమానాలు వాడికి కావాలి. శ్రీనాథ్‌కీ వాణికీ మధ్యనున్న చనువూ, సోదర ప్రేమా వాడికి కావాలి ... ఎంత హోల్‌హార్టెడ్‌గా మనం వాడిని చూస్తున్నా...ఏదో ఎక్కడో ఆ లేతమనసు వెలితిని ఫీలై షాక్ తింటున్నాడు మెంటల్‌గా! సరిగ్గా ఆర్నెల్ల నుంచి వాడీ మానసిక క్షోభకే అడపా తడపా గురై; గతవారమంతా ఆబాధే తారస్థాయికి పోగా మంచం పట్టేడు!...ప్చ వాడినెలా సముదాయించాలో నాకర్థం కాడం లేదు'' అన్నాను చెప్పుల్లో కాలుపెట్టి తలదువ్వుకొంటూ.

సైకిలు దింపుతుండగా పోస్టుమేను వచ్చి ఓ కవరందించేడు. కలకత్తా నుంచే వొచ్చింది నా పేరనే! చింపబోతూ శేఖర్ కిచ్చిన మాట గుర్తుకొచ్చి ''వాడొచ్చిన వెంటనే ఇయ్యి. నే స్కూలికి వెళ్తున్నా'' అని నా భార్యకి కవరందించి పెడల్ వేసేను–వాణిచేతి టాటా నందుకొని.

సాయంత్రం నే వొచ్చేసరికి కుర్రాళ్ళిద్దరూ మరికొందరితో కలిసి మండువాలో దాగుడు మ్రుచ్చులాడుకొంటున్నారు. వాణి ఈమధ్యే సరదాగా కుట్టించిన కొత్తజరీఅంచు పరికిణీ, జాకెట్టూ కట్టుకొని; పొట్టి పిలకకి నాలుగు చేమంతిపూలు కుట్టించుకొని జడగంటలు వేసుకొంది. వాటి బరువుకే జడ సాగినట్లుంది. ఆటలో తల్లిగా వాణినే పెట్టుకొన్నారుగాని; దొంగలోత్బాటు తనూ ఆవారా ఈవారా నక్కుతూ, అటూ ఇటూ పరిగెడుతూండడంవల్ల తల్లిని దొంగలు ముట్టుకోడంకాక తల్లే దొంగల్ని ముట్టుకోడంతో కుర్రాళ్ళు మరింత గోలచేస్తున్నారు.

''కాఫీ తెస్తావా – అన్నయ్య ఏవిటి రాసేడు'' ఇంట్లోకి వెల్తూ వంటింట్లోవున్న నా భార్యతో అన్నాను.

''ఏమో పాపం వాడు సరదా పడ్డాడేగాని; అది ఇంగ్లీషులో వుండడంవల్ల దిగాలు పడిపోయి దాచేసి ఆడుకొంటున్నాడు. మీరు

కాళ్ళు కడుక్కోండి ముందు'' అంది. ''ఏవిటి విశేషం? ఏదో సువాసన వేస్తోంది'' అని నేననే లోపలే కుర్రాళ్ళింట్లోకి రావడం, నన్ను చుట్టుముట్టడం అయింది. శ్రీనాథ్ ''నాన్నా ఇవాళ నేను అన్నయ్యా, అన్నయ్య తమ్ముడూ, చెల్లి అక్కా అయిపోయేం! – ఏవిటో చెప్పుకో చూద్దాం'' అన్నాడు.

ఇంతట్లోకే జాపోస్తూ వొచ్చిన వాణి ''నాన్నా నాన్నా మలేం మలి అమ్మ–కాదు నాన్నా పెద్దన్నయ్య ఇప్పులే పుత్తేసేడు నాన్నా! మలి అమ్మ నేనూ ఆ వెల్లి కొత్తు మించి సామానులూ, బత్తలూ తెచ్చేం మాట. మలి నాకు కాళ్ళు పీకెలతాయి కదా అందుకని లిక్సా ఎక్కి వెళ్లేం. నాన్నా–పెద్దన్నయ్య బల్లో అమ్మగాలు నన్ను ఎత్తుకుని వుంచేత్తామన్నాలు. నాకు బిల్లలుఇచ్చేరు. నేనన్నీ మల్చిపోయే నాన్నా మలి ఇలాగా చెవులో సెప్పాలి అమ్మ నాకిట్టం అని ఎవ్వో అప్పచ్చులు చేత్తున్నాది సూత'' అని చెవినుంచి వొళ్ళోకి జారింది.

''ఉఁ... ఇదొక్కత్తి వాగుడు కాయలాగ. ఎంతో సీక్రెట్‌గా వుంచుదామని అంతా అనుకొంటే''అన్నాడు శ్రీనాథ్ ఉరుముతూ.

''ఆరి దొంగల్లారా అదా సంగతి మరి పొద్దున్న చెప్పేవు కాదేమే'' అన్నాను శేఖర్ వైపు చూస్తూ. వాడు తలంటుకొని పసుపుపెట్టిన కొత్త బట్టలతో పిన్ని అందించే ప్లేట్ను మూకం దిస్తున్నాడు.

''నాకేవిటో జ్ఞాపకవే లేదు. మధ్యాహ్నం పడుకొన్నానంతే ఇదిగో మీ అమ్మగారు ఎందుకన్నాదో 'అమ్మా నా పుట్టిన రోజుకేం చేస్తావే' అని. అంతే ఠక్కున జ్ఞాపకం వొచ్చింది 'ఇవాళ శేఖర్ పుట్టిన రోజు కదా' అని! అబ్బబ్బ ఆ నూనెకో దణ్ణం. ఊరికే పొంగిపోతూ తెగ ఏడ్పించిందనుకోండి'' అంది చెంగుతో తుడుచుకొంటూ.

''బాగుంది నాకన్నా మీ పిన్నే నయంరా! – హేపీ బర్త్‌డే టూ యూ'' అన్నాను ప్లేటు నందుకొని శేఖర్ భుజం చరుస్తూ.

''నువ్వు కూడా తినేయి పిన్నీ, తరవాత వంటిల్లు సర్దుకొని స్నానం చేద్దువుగాని'' అంటూ తానే స్వీట్స్‌సర్దిన ప్లేట్‌ని నాభార్య కందిస్తూ శేఖరన్నాడు.

''మర్చిపోయేను – మలి మీలెందుకు ఈ కొత్తబత్తలూ జలగంతలూ చింగారించేచేరు సార్!'' అన్నాను వాణి నోట్లో స్వీట్ నొక్కుతూ.

'నువ్వంతా యెప్పలూ మల్చిపోడవే నాన్నా – మలి నేను కూలా రేపో ఎప్పలో పుత్తేసేను కదేంటి నాన్నా. మలేం – నువ్వు మల్లా మలిచిపోయేవు. నేను సెప్పెయ్యనా! మలేం పెద్దనాన్నగాలి వుత్తలం సూచేవా.''

''ఔనే నిజంగా నేనూ మర్చిపోయేను'' అంటూ శేఖర్‌వెళ్ళి ఉత్తరం తెచ్చేడు.

''ఏరా రాస్కెల్. వాడికితెలీపోతే తెలీపోయిందిగాని నువ్వన్నా చదవలేవ్రటా. రాస్కెల్స్ మళ్ళా కాన్వెంట్‌లో వెలిగిస్తున్నారు.'' అన్నాను ప్లేట్లో స్వీట్‌ని విఱిచి వో ముక్క శ్రీనాథ్ నోట్లో కుక్కుతూ; కనరందుకొని మిగతా ముక్క శేఖర్ నోట్లో కుక్కుతూ.

'అదేవిటి వాడు పెద్ద క్లాసా నేను పెద్ద క్లాసా? అయినా మాకు స్కూల్లో నేర్పేదీ మా కలవాటైనదీ ఇటాలిక్ స్క్రిప్ట్ సార్! నువ్వంటావుకదా 'సిరాబుడ్డిలోంచి వొచ్చిన చీమ తెల్లకాగితం మీద పాకినట్టు' అని అలాంటి ఆ కలిపిరాతని హౌ కెన్ వుయ్ రీడ్ సార్! అసలా లెటర్‌లో వొక్క లెటర్ కూడా మాకు తెలీలేదు'' అన్నాడు శ్రీనాథ్.

నవ్వుకొంటూ కవరులోంచి వుత్తరం తీసేను. ఓ పావువంతు మేర రాసివున్న లెటర్‌హెడ్‌కి పైన పిన్‌చేసి నాలుగు వందలకి వో క్రాస్డ్ చెక్కు వుంది. ''వీడికి పిచ్చెక్కుతున్నట్టుంది. మొన్న రెణ్ణెళ్ళక్రితమేనా ఆరొందలు పంపిస్తే! ఏవిటి ఈ పదేళ్ళ కుర్రాడి రీసెర్చి స్టడీస్‌కి సాలుకి ఏ మూడువేలో ఖర్చుచేయమంటాడు గాబోలు'' అంటూ లెటర్ చదివి;

''నేనూ, నీ వదినా ఇక్కడ క్షేమం. నీకూ శేఖర్‌కీ పిల్లలకీ మందరికీ ఆశీస్సులు. ఈ డబ్బు శేఖర్ చదువు ఖర్చులకోసం పంపిస్తున్నాను. క్రితం నెల ఏం పంపనందుకు మరోలా ఏం అనుకోకు. రాబోయే సంక్రాన్తికి నీ దగ్గరకీ, తాడికొండలో నా బావమరది దగ్గరకీ, మా మావగారింటికి అంటే నెల్లూరూ వచ్చి మిమ్మల్నీ శేఖర్, రాజీ, విజ్జీలనీ చూచి రావాలనుకొన్నాను కాని; అనుకోకుండా నా ఫ్రెండ్స్ జనవరి తొలి రెండు వారాల్లోనూ డార్జిలింగ్, గాంగ్టాక్ వగైరాలకి టూర్ వేసేరు. కాబట్టి రాలేకపోతున్నాం. చి॥ సౌ॥ మందరిని మీ వదిన అడిగినట్టు వ్రాయమంది. వెంటనే ఉత్తరం కోరుతున్నాను. నీ అన్న'' అని తర్జుమాచేసి చెప్పేను.

''అదేవిటి పుట్టిన్రోజు అని ఇవాళే అందేలా ఆ చెక్కూ, వుత్తరం రాసేరనుకొన్నాం'' అంది నా భార్య.

శేఖర్ చూడకుండా నా భార్యని ఎర్రగా చూసి కన్నుగీటుతూ ''బాగుందే–నీకే మధ్యాహ్నందాకా జ్ఞాపకంరాలేదు! రాద్దామనుకొనే మర్చిపోయేడు కాబోలు. అయినా సరిగ్గా సమయానికి వొచ్చిందిగా కానుక. ఇన్కంటాక్స్ ఆఫీసరుగారి ద్వితీయ పుత్రరత్నానికి తండ్రి ఇచ్చే ఫాయాలోనే వుందిలే కానుక'' అని కవర్ని శేఖర్ జేబులో పెడూత ''అయితే ఇవాళ ఏవిట్రా ప్రోగ్రాం డిసైడ్ చేసేరు'' అన్నాను మాటమారుస్తూ.

''సర్కస్'' అన్నారు శ్రీనాథూ వాణీ గొంతులు కలిపి.

''మీరేవిటి చెప్పడం! వాడు చెప్పాలి'' అంది నా భార్య.

''ఇవాళ సర్కస్ వద్దు.''

''ఏంరా హాయిగ సర్కస్‌కి పోదాంరా'' అని మళ్ళా శ్రీనాథూ వాణీ అంటూండగానే నేనూ గొంతు కలిపేను.

శేఖర్ కొంచెంసేపు ఏం అనకుండా వుండి; తలదించుకొని ఎటో చూస్తూ అన్నాడు—"ఇవాళంతా పిన్ని పనిచేస్తూనే వుంది. అసలు పడుకోలేదు—తలనొప్పి వచ్చి రానంటుందని."

దాని సంగతేమో కాని నేనుమాత్రం వాడి మాటకి వొక్క సారి చలించిపోయేను. నిలుచున్నపళంగా శేఖర్ని పొదివి పట్టుకొని అక్కున చేర్చుకోవాలనిపించింది. కాని; వాడి తల నివురుతూ "ఆరినీ-అదా?! ఫరవాలేదు సర్కస్‌కే పోదాం. ఏమే నువ్వేమంటావ్?"

"నాకేం—పావుగంటలో తెమిలిపోతాను."

"ఇవాళ వొద్దులెద్దురూ" అన్నాడు శేఖర్.

"మరేం చేద్దాం" అన్నాను.

"ఇవాళ పౌర్ణమికదా హాయిగా మేడమీద కూర్చుందాం అందరం . మీరుమాత్రం కథలు చెప్పాలి" ఇలా అని ఏదో చిన్నతనం ఫీలైనట్లు అటు చూస్తూ వాణి నెత్తేసుకొని వుండువాలోకి పారిపోయేడు.

నా మట్టుకు నాకు గుండెల్లోంచీ ఏదో అనిర్వచనీయభావం ఉబికి వొస్తోంది. శేఖర్‌ని అలా చూస్తూ; తమాయించుకొని లేచేను.

రాత్రి 'చిక్కుడు గింజా చాక్లెట్లలోకం' కథ అయి 'సిందుబాద్' కథ మొదలెట్టేసరికే వాణి తల్లి తొడనోదాన్ని ఆక్రమించుకొని నిదురబోతోంది. 'సిందుబాద్' కథ అయి 'కాంచనద్వీపం' మొదలుపెట్టిన కొంచెం సేపటికే శ్రీనాథ్ తల్లి రెండో తొడపై తల ఆన్చి పడుకొన్నాడు. జిమ్, డాక్టర్లబృందం అస్థిపంజరం గుర్తును వెతికేలోగానే నా భార్య అలాగే వొళ్ళో పడుకొన్న పిల్లలతో తాను వెనకనున్న పిట్టగోడకి జారబడి పడుకొంది. కథ సాగుతోంది.

సిగరెట్ వెలిగించేను. ఆకాశమాత వుంచిన మేఘాల పొత్తిళ్ళలో చంద్రుడు మాటిమాటికీ దాక్కుంటూ దోబూచులాడుతున్నాడు! తల్లి ప్రేమలా లోకాన్నంతనీ వెన్నెల ఆవరించివుంది!

కథ చెప్తూ చెప్తూ అనుమానం వొచ్చి శేఖర్ని చూసేను. వాడి దృష్టి కథమీదనుంచి చెదిరి నా భార్యపైనా; ఆమె వొడిలో వెన్నెట్లో ఆదమఱచి నిదురించే శ్రీనాథ్, వాణీలమీదా పడింది. మళ్ళా సాయంత్రంలాగే నా గుండెల్లోంచీ ఏదో భావం ఉబికి వొస్తోంది. తమాయించుకొని ఠక్కున కథని ఆపేసేను. శేఖర్ వొక్కసారి నావైపు చూసి అంతట్లోనే శూన్యంలోకి చూస్తున్నాడు. వాడి కళ్ళలో వెన్నెల చోటుచేసుకొంది?! ఏం నాన్నా పడుకొంటావా? కథ మానేసేదా!" అన్నాను. ఊకొట్టేడు. "ఇలా దా రేపు కలకత్తా వెళ్ళొద్దామా!" అన్నాను. "మీ యిష్టం."

ఫిష్ ప్లేట్లు దగ్గరి కుంకంబాళ్ళు కూడా లేచి ముందు వొస్తున్నాయా అని అనిపించేటంత వేగంగా కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ పరుగెడుతోంది.

చిలక సరస్సు దాటేసరికి శేఖర్ పడుకొన్నాడు. సిగరెట్‌మీద సిగరెట్ వెలిగిస్తూ వాడి ముఖంలోకే చూస్తూ కూర్చున్నాను. బుర్రంతా ఆలోచనల గాలులతో గింగురెత్తుతోంది! శరీరమంతా ఏదో భావోద్వేగం తారస్థాయిలో ప్రవహిస్తున్నట్లుంది! రైలు భువనేశ్వర్ దాటి మరింత వేగాన్ని పుంజుకొంది... రెండేళ్ళబట్టీ నా దగ్గిరే వుంటున్న వీడు నాలో రేకెత్తించని భావతీవ్రతని సరిగ్గా ఈ ఆర్నెల్లబట్టీ ఎలా నాలో రేపుతున్నాడు?— ఈ ఆర్నెల్లబట్టీ వీడి ప్రతి మాటా చేతా అతి నిశితంగా పరిశీలిస్తున్నాను గాబట్టా?! మొన్న వారంరోజుల జ్వరంనుంచి తేరుకున్నాక నిజంగా ఏదో ప్రశాంతతా, కాంతీ, సంతృప్తీ వీడిమొగంలో కొట్టొచ్చినట్లు కన్పిస్తున్నాయి. అంతకుముందు ఎప్పుడూ పరధ్యానంగా, ముభావంగావుండే వీడి కళ్ళల్లో ఈ నాలుగు రోజుల్నించీ వింత వింత వెన్నెలకాంతులు కన్పిస్తున్నాయి?! ఇంత లేతవయసులో ఇంతగా లైఫ్‌తో రాజీపడ్డం సాధ్యమయే పనేనా అని?! రైలు పోతోంది.

★ ★ ★

కలకత్తా ఉదయం ఏడుకి చేరేం. ఎస్ప్లనేడ్‌కి ప్రక్కగా రబీంద్రమార్గ్‌లో వున్న వో పన్నెండంతస్థుల భవంతిలో పదకొండో అంతస్థు—మా అన్నయ్య నివాసం. కలకత్తా రావడం నాకు మూడో సారీ, శేఖర్‌కి రెండోసారీ కాడంతో సులువుగా ఓ ముప్పావుగంటలోనే ఇల్లు చేరేం. తలవని తలంపుగా మేం కంటబడేసరికి అన్నయ్యా వదినా కాస్తంత ఆశ్చర్యపడ్డారు!

కాలకృత్యాలూ, బ్రేక్‌ఫాస్టూ అయేక శేఖర్ రేడియోగ్రాం వున్న రూమ్‌లో రికార్డుల ఆల్బం ముందేసుకుని ఏవేవో రికార్డులు తీసి ఆన్‌చేస్తూ ఆపుతూ ఎంచుకొంటున్నాడు.

నేను బెడ్ రూంలో వూరకే దొర్లుతున్నాను- ఏవో పత్రికలు తిరగేస్తూ. ఉన్నట్టుండి దండెంమీద నా దృష్టిపడింది. అస్తవ్యస్తంగా దండెంమీంచి వ్రేలాడుతున్న తెల్లచీరకి దిగూన దండెంమీంచి ఏదో వ్రేలాడుంటే లేచి చీర జరిపి చూసేను- కుట్టిన పూలజడ?! వాడిన పూలతో అదో వెగటు వాసన వేస్తోంది. ఇందాకా డైనింగ్ హాల్లో టేబుల్ దిగూన బేసిన్‌లో కుప్పగావున్న గాజు గ్లాసులకీ, ముగ్గులకీ, ప్లేట్లకీ దీనికీ ఏమిటో సంబంధం! అనుకొంటూ ఫ్రిజ్ తెరిచేను. మధ్య అరలో మూడు బీర్ బాటిల్సూ, రెండు విస్కీ, ఒక జిన్నూ వున్నాయి. దిగూ అరలో పళ్ళూ, ఏవేవో డ్రింక్ సీసాలూ వున్నాయి. పై అరలో మంచి ఆర్టిస్టిక్‌గా వున్న ఓ గాజు జాడీమీద నా దృష్టిపడింది. ఎర్రని నీళ్ళలో వూరేసిన ఉసిరికాయల్లా తేలుతూ ఏవో పళ్ళున్నాయి! అతి పదిలంగా జాడీ తీసి పట్టుకొని మూతతీసి వాసనచూసేను. అదో ప్లెజెంట్ స్మెల్! ఏదో వైన్ వాసనే! కాని; ఈ పళ్ళేవిటి ?!

టర్కీ టవల్తో తుడుచుకొంటూ రూంలోకి అన్నయ్య వొచ్చేడు. "ఏవిట్రా–ఇవి!" అన్నాను స్పూన్‌తో వో రెండు నోట్లో వేసుకొంటూ. "అవా–ఏం ఎలా వుంది టేస్ట్! అలా కాదనుకో తినడం· వాటి సంగతి రాత్రి చెప్తాలే–అంతదాకా నువ్వా పళ్ళని తినేకుండా మిగిలిస్తే నేననుకో. నిన్న మీ వదిన మేరేజ్ డే అంటూ తెగ హంగామా చేసిందిలే. చిన్న పార్టీ ఇచ్చేం మా ఫ్రెండ్స్‌కి ఇంట్లోనే రాత్రి. మీరు ఏ అర్ధరాత్రో రాకపోడం మీ –మా అదృష్టమే! ఏవిటో లైఫ్‌ని ఎంత యెన్జాయ్ చేస్తున్నా తనివితీరదు నాలాంటి వాళ్ళకి! ఇవాళ తప్పనిసరిగా ఆఫీసు కెళ్ళాలి. నిన్న ఫ్రెంచి లీవు కూడాను. కారు పంపిస్తాను – ఎక్కడికన్నా వెళ్ళండి మీ ముగ్గురూ" అన్నాడు డ్రస్ పూర్తిగా దువ్వుకొంటూ.

"శేఖర్ ఎక్కడికీ రానన్నాడు. రాత్రి నిద్రలేక నాకూ టీడియస్‌గా వుంది. నువ్వు వొచ్చేవఱకూ పక్కేస్తాను" అన్నాను ఆవలిస్తూ. పళ్ళు ఏదో వింత రుచితో స్లైట్ ఆల్కహాలిక్ ఘాటుతో నిండారా ఏదో రసాన్ని చిప్పిలుతూ నోట్లోంచి లోపలికి జారుకున్నాయి.

"సరే నీ యిష్టం. ఎంత పయత్నించినా రాత్రి ఏడు దాటుతుంది నే వచ్చేసరికి. అయినా ముందుగా రాడానికి చూస్తాను. మరి నేను భోజనం చేసి పోతాను" అని వెళ్ళేడు.

మధ్యాహ్నం నాకు తెలివి వొచ్చేసరికి వొంటిగంటయింది. ప్రక్క రూంలోంచి "సాహా సాహూరే" అని ఏదో చక్కని బెంగాలీ పాట విన్పిస్తోంది. గొప్పగా మనసును ఊపేస్తోంది, ఒక్క ముక్కా అర్థం కాకపోయినా! ఏదో జానపద గీతంలాగే వుంది. పాట అయేక మళ్ళా అదేపాట వేసేడు! ఎవరో ప్రేయసి ఎందుకో ప్రియుణ్ణి నిందిస్తోంది గాబోలు. 'సాహూ' అంటే సాధువు కదా! మరి సన్యాసికి ప్రేయసి తిట్లేవిటి?! ఏమైనా భాష అర్థం కాకపోయినా ఆ పాటలో భావం మాతం అదే తప్పకుండా.

"మున్నీ! ఎక్కడనుంచి లాగేవురా ఆ వెధవ పాటని – అన్నీ అప్టుడేట్ రికార్డులుండ! అంకుల్ లేచేరేమో చూడు మీల్స్ చేద్దాం" అవతలి రూంలోంచి వదినగారు శేఖర్ని కేకేసేరు.

నేను లేచి శేఖర్ రూంలోకి వెళ్ళి "ఎవ్వరా పాడుతుంట?" అన్నాను.

"రూనా లైలా! బాగుంది కదండీ పాట! బెంగాలీ ఫోక్ సాంగుట. ఈ పాటైపోనీండి–ఇదే రికార్డు వెనకాతల హేమంత్ కుమార్, చక్రాబార్తీలు పాడిన మరో రెండు పాటలు గూడా చాలా బాగున్నాయి."

"చక్రబర్తి కాబోలురా· ఇంగ్లీషులో అలాగే రాయాలికదా. బెంగలీలో 'వ'కి 'బ' పలుకుతారులే. నువ్వింకా భోం చేయలేదూ–లే మరి."

"మీరు పడుకొన్నాక అమ్మ ఫ్రెండ్స్ వొస్తే వాళ్ళతో మాట్లాడుతూ కూర్చొంది. ఏం తోచక నేనలా ఓసారి బజారులోకి వెళ్ళొచ్చేను" అంటూ లేచి తన బేగ్ తెరిచి వో నెమిలి బొమ్మా, రెండు పుస్తకాలూ నా చేతికిస్తూ "చెల్లికీ తమ్ముడికీ" అన్నాడు.

"అరినీ...బాగా సెలక్ట్ చేసేవే" అని పుస్తకాల్నిచూసేను. వొకటి 'ది సాగా ఆఫ్ అవర్ ఇండిపెండెన్స్', రెండోది 'ది వరల్. ఆఫ్ బర్డ్స్'· నెహ్రూ బాలల సంస్థవారి ప్రచురణలు రెండూను.

"ఇవాళెక్కడికీ వెళ్ళొద్దన్నావని నాన్న కారు పంపిస్తానంటే వొద్దని పడుకొన్నా–దా భోం చేద్దాం" అన్నాను పుస్తకాలూ, బొమ్మా అందించి డైనింగ్ హాల్లోకి వెళుతూ.

"చిన్నాయనగారూ! మున్నీ అచ్చు మీలాగే తెగ రిజర్వ్‌డ్‌గా వుండడం నేర్చేసుకొన్నాడండీ. రాజీ ఇలా కాదు–వొచ్చిం దగ్గర్నుంచి టాటా చెప్పేదాకా మమ్మీ మమ్మీ అంటూ వొకటే సోదె–ఆ తాడికొండ స్కూలుగురించీ, వాడి పిక్నిక్‌ల గురించీ మా తమ్ముడూ మరదళ్ళ గురించీను. ఇక చిన్నారి అంతా అదో తరహా. దాని కొంచెం అన్‌హెల్దీగా వుందని మొన్నే మా డాడీ లెటర్ రాసేరు. పోనీ వోసారి చూసొద్దామంటే–ఎక్కడా తీరదనుకోండి చిన్నాయనగారూ! పోనీ మీరన్నా వొస్తారేమో అంటే అదీలేదు. ఆ బొంబాయి కాన్ఫరెలలో వున్నప్పుడు అసలేలేదు. ఏదో కొంచెం దగ్గరి కొచ్చేం కదా మీ ఆవిడనీ పిల్లల్నీ తీసుకురండి" అన్నారు వదినగారు వడ్డన పూర్తిచేసి తానూ భోజనానికి కూర్చుంటూ.

"కలకత్తా విజయనగరానికి దగ్గరా!...వొస్తాం. నే వచ్చిన మూడుసార్లూ అప్పటికప్పుడు అనుకొని బయలుదేరడవే అయింది. ఈ స్వీట్లన్నీ ఎప్పుడు చేసేరు."

"లేదండీ – మామూలు వంట ఆ బెంగాలీ వంటావిడే చేస్తుంది. అవి కొన్నవే ఇవాళ సాయంత్రం ముగ్గురం సరదాగా ఏ రామకృష్ణమఠ్‌కో వెల్దామనుకొన్నాను. కాని; అనుకోకుండా ఇక్కడుంటే ఆంధ్రమహిళా సంఘం ఇవాళే మీటింగ్ పెట్టింది – నేను సెక్రటరీని తప్పదు వెళ్ళాలి. కారు వొస్తుంది మీరిద్దరూ ఎక్కడికన్నా వెళ్లరాదూ."

"చూద్దాం సాయంత్రంకదా!" లేచి బేసిన్‌లో చేతిని కడుక్కుంటూ అన్నాను.

★ ★ ★

రాత్రి మేమిద్దరం విక్టోరియా మెమోరియల్నీ, అబ్జర్వేటరీ షోనీ చూసుకొని వొచ్చేసరికి రాత్రి ఎనిమిదైంది. అప్పుడే అన్నయ్య వొచ్చేడు. శేఖర్ మా కంటే ముందే భోంచేసి రేడియోగ్రాం రూంలో పడుకొన్నాడు.

భోజనాలయేక మేం ముగ్గురం డ్రాయింగ్ రూంలో కూర్చున్నాం.

అన్నయ్య సిగరెట్ వెలిగించి "మరదల్నీ పిల్లల్నీ తీసుకు రావలిసిందిరా, సరదాగా సిటీ చూద్దురుకదా" అన్నాడు.

"అనుకోకుండా బయలుదేరేను...శేఖర్‌కి ఈమధ్య ఓ వారం వొంట్లో బాగోలేదు. అనారోగ్యం ఏవీఁకాదు. మీకోసం బెంగపెట్టుకున్నాడు. ఎప్పుడూ మీ గురించే ఆలోచిస్తుంటాడు. పోనీ వోసారి చూపించి తీసుకొద్దామని ఇలా తీసుకొచ్చేను...దానికేం గాని . మీరు ససేమిరా పిల్లల్ని పట్టించుకోమంటే ఎలారా" అన్నాను.

"అదేవిఁట్రా మరీ అలా పట్టించుకోడం లేదంటావ్ !! ఇంకా ఏం చేయాలి చెప్పు! ఆ మధ్య వొచ్చినప్పుడూ సూచావా బాగా ఇదే అన్నావు. వుత్తరాల్లో సరేసరి. సరే . నీకిలా కాదు చెప్పడం—ఉండు!" అంటూ బెడ్‌రూంలోకి వెళ్ళి ఐరన్ సేఫ్‌లోంచి వో మూడు పాస్ బుక్కుల్ని తెచ్చి నా ముందర టేబుల్‌పై పెడుతూ "వాటిని చూడు. విడివిడిగా ముగ్గురిపేరా నెల నెలా ఎంత డిపాజిట్ చేస్తున్నానో! ఇది కాక తాడికొండకి నెల నెలా ఎంత కడుతున్నానో నీకు తెలీంది కాదు. ఆ వూర్లోనేవున్న నా బావ మరిదిక్కూడా సెలవుల్లో వాడిని చూసేందుకు వేరే పంపిస్తున్నాను. ఇక మా మావయ్యగారికికూడా అంటే ఇంకా బొడ్డూడని పిల్లక్కూడా నేను డబ్బు పంపిస్తున్నాను. మరి నీకు ఏదో రీతిగా సర్దుబాటు చేస్తూనే వున్నానుకదా ! ఏం ఇంతకన్నా ఏ తండ్రి తన సంతానానికి ఖర్చుచేస్తాడో చెప్పూ. ఇంతకీ నీ వదినక్కూడా ఈ క్షణందాకా చెప్పని వో సీక్రెట్ నువ్వు విన్నావంటే అదిరిపోతావ్ — నువ్వంత ఇదిగా రెట్టించి రెట్టించి ఆ మాట అంటున్నావని చెప్తున్నా విను—సరిగ్గా పన్నెండేళ్ళనుంచీ నా జీతంలో నయాపైసా నాకు గాని ఇంటికి గాని ఖర్చుచేసి యెఱుగనంటే నమ్ముతావా? అందులో ప్రతి పైసా పిల్లలకోసం పంపీ, డిపాజిట్‌చేసీ — నేనేం అఘోరించినా ఈ నా ఇంటికేం చేసినా నేను కతికే వాతాల్తోనే అఘోరిస్తున్నాను?!" అన్నాడు అయిపోతున్న సిగరెట్‌తో మరోదాన్ని వెలిగిస్తూ.

"అలా విపరీతార్థాలుతీస్తే నేనేంచెప్పగలను కాని, కుర్రాడు మీకోసం పడే ఆరాటం కళ్ళారా చూస్తున్నాను గాబట్టి అలా అనకుండా ఉండలేకపోతున్నాను."

"మీ మాటలకి అడ్డొస్తున్నానుగాని — చిన్నాయనగారూ మీరేవిఁటో అలా ఏవేవో చెప్తున్నారుగాని రాజీ హాయిగా వుండటం లేదుటండీ?! చిన్న గుంటముండ విజ్జీ హేపీగా మా డాడీ దగ్గిర వుండటం లేదుటండీ?! వాళ్ళు బెంగపడ్డట్టు వొక్క లెటరు నేనే నాడూ కళ్ళచూడలేదు ... అయినా మాకు మాత్రం వుండదూ పిల్లలు దగ్గిరుండాలని! . కాని, ఎలా?! ఈ మీ అన్నయ్య మాయదారి వుద్యోగంవల్ల పిల్లి పిల్లల్ని పెట్టి ఇల్లిల్లూ తిప్పిందన్నట్టు అవుతోంది. పైగా ఈ మహాపట్నాల్లో దినదినానికీ వాళ్ళరాకకోసం పోకకోసం పడే నరకంకన్నా దూరంగావున్నా మీ దగ్గిరా మీ దగ్గిరా వుంటేనే క్షేమంగా వుంటారన్న ధీమాకొద్దీ కన్నతీపి చంపుకొని పెట్టుకోవాల్సి వచ్చింది" అని వదినగారు అంటుండగానే అన్నయ్య—

"నువ్వూరుకో సరూ...అసలు నీ హెల్త్ కోపరేట్‌చేయదు. నువ్వెళ్ళి పడుకో ముందర...ఈ మాటల్లో మరిచేపోయేను. చూడు ఆ ఫ్రిజ్‌లో నిన్న ఆ కాన్టినెంటల్ హోటల్ సేట్జీ నీకు ప్రెజంట్ చేసేడు కదా ఆ జాడీ ఇలా తీసుకురా" అన్నాడు.

"ఆవిడను పొమ్మంటావెందుకు ? ఉండనీ ... ఆవిడన్నదీ రైటేగాని; రాజీ వుంటున్నది — సైకాలజీలో ప్రత్యేకంగా తర్ఫీదు పొందిన మాష్టర్ల కుటుంబాల మధ్యలోనూ; సమవయస్కులైన పిల్లల మధ్యాను. పైగా నా దృష్టిలో వాళ్ళు కూడా నాలాగే మీకు వుత్తరాలు రాసివుండాలి. రాసి రాసి మానేసేనా వుండాలి! లేదా - తల్లిదండ్రుల్ని మరిపించే వాత్సల్యాన్ని చూపేవారో; అథవా అసలు కుర్రాళ్ళ మెంటాలిటీని కేర్‌చేయని వాళ్ళో అయివుండాలి. ఇంతకీ రాజీ, శేఖర్‌లు అన్నదమ్ములేగాని వొకే మనస్తత్వంగలవాళ్ళు కావాలని లేదుగా !

నేను కేవలం శేఖర్ గురించే చెప్తున్నాను. వాడి ప్రతి కదలికా ప్రతిమాటా సాకల్యంగా అవగాహన చేసుకొనే చెప్తున్నా.

వాడికి నువ్వనే డబ్బు కాదు కావల్సింది. నాన్న చూపే అభిమానం, ఆదరణా; నాన్న చేసే బుజ్జగింపూ; నాన్నపిలుపూ కావాలి వాడికి! కనీసం నీ వాత్సల్యపూరిత సంబోధనతోవున్న వుత్తరం ముక్కైనాసరే, వాడు అత్యంత సంతృప్తితో స్వీకరిస్తాడు. వాడికి కావలసింది, వదినగారు అన్న లేక అనుకొంటున్న పోషణా రక్షణా మాత్రమే కాదు. తల్లిని 'అమ్మా' అని పిలుచుకోడం; తల్లిని వాటేసుకొని ఆమెవొడిలో ఆదమరచి నిదురబోవడం; తల్లి అందించే అనుక్షణానురాగం—ఇవీ వాడికి కావాలి !

తోబుట్టువులు అనురాగంతో తిట్టే తిట్లకీ మమకారంతో కొట్టే కొట్లకీ ఆ పసిహృదయం వేసారిపోతోందంటే మీ కర్థం అవుతుందా అని?!" ఆవేశంతో ఇంకా ఏం మాట్లాడేస్తానో అని తమాయించుకొంటూ ఎదురుగ వున్న అన్నయ్య సిగరెట్ పెట్టెతీసి సిగరెట్ వెలిగించేను.

"అసలు వాళ్ళిద్దరికీ కష్టంగా వున్నప్పుడు మీరు మరీను ! ఆతాడికొండవాళ్ళంటే ఇన్కమ్ గురించి ఏదో కొత్తరూల్‌పెట్టేరు గాని ఇంక స్టేట్ అంతా గొడ్డుపోయిందిటండీ? అక్కడెక్క..."

"వదినగారూ మీరా మాటంటే నేనొప్పుకోను. ముందా మాట విత్‌డ్రాకండి...కష్టం ఏవిఁటి కష్టం ?! నేనలా కలలో కూడా అనుకోలేదు. నాకొడుకొకటీ శేఖరొకటి కాదు నాకు. అయినా నేనెందుకు కష్టమనాలి? వో చిల్లిగవ్వైనా వాడికి నే పెడ్తున్నానా యేం ? ఇవాళదాకా వాడికోసం మీరు పంపిన మొత్తంలో వాడి చదువు ఖర్చు పోనూ ఇంకా మూడువేల పైచిలుకు బ్యాంకులో మూలుగుతూ వుండగా నాకు ఇంకా కష్టమేవిఁటి ?! ... మీ అంతరాంతరాల్లో అంటుకుపోయిన అభిప్రాయం నా కర్థంకాక కాదు ! 'వాళ్ళిద్దరికీ' అంటున్నారు. ఇక్కడ ఏదో నా భార్యని మీరు వేలు పెట్టి చూపేరని నేనేదో వెనకేసుకొస్తున్నాననో, లేచిపడుతున్నా

నని మీరనుకోవద్దని ప్రార్థన! నా భార్య గురించి నేను కాదు చెప్పాల్సింది. వెళ్ళి ఆ పడుకొని కలలుగంటున్న శేఖర్‌ని లేపి అడగండి!...మీరు వినలేరు! ఊహించలేరు!...మీరు నన్నంతగా గాయపరిచేరు గాబట్టి, నేనొక్కటంటే వొక్క మాట–మిమ్మల్ని గాయపరచడానికే అనుకోండి; మీకు అర్థం చేయించే తపనవల్లే అనుకోండి అంటున్నాను మన్నించండి?!

నిన్నటి రోజుకు మీ జీవితంలోవున్న ప్రత్యేకత మీకు మరపురాలేదుగాని; మొన్నటి రోజుకువున్న విలువ ఏది ఈ క్షణానికూడా మీకు గుర్తు వొచ్చిందా అని?!...''

''ఏయ్ సరూ. ఏవిటి చెప్పు ఆ మాటలు? వూరికే ఆలోచనా పాలోచనా లేకుండా అనేయడం, ఏడవడమూను!... ఊఁ నువ్వు వెళ్ళి పడుకో! ప్లీజ్ వెళ్ళు సరూ'' అంటూ అన్నయ్య ఆవిడ చేతిలోని జాడీని కప్పునీ అందుకొని టేబుల్‌మీద పెట్టి; ఆవిడ బుజాలపై చేతులునేసి 'ఏవిటి సరూ చెప్తుంటే. ముందుకళ్ళుతుడుచుకొని వాడికి సారీ చెప్పి వెళ్ళు. ప్లీజ్ నాకోసం'' అన్నాడు.

నాకు చిటపటలాడిపోతోంది ఎలా నిల్రదొక్కుకున్నానో నాకే తెలీదు! ''అదేవిటి ఆవిడ నాకు సారీ చెప్పడమేవిటి. తల్లిలాంటివారు! అయినా నన్నంత చనువుగా మాట అనేవా రెవరుంటారు?...నేనొప్పుకోను''అన్నాను ఏష్‌ట్రేలో సిగరెట్‌నినొక్కుతూ.

''ఊఁ. కూర్చోమరి. ఆ కప్పులో వాడికి వో ఐదుపళ్ళు సర్ది ఇయ్యి. ఏవిటో నా వున్నెంకొద్దీ ఈ వదినా మరుదుల గలాటాలో ఆ జాడీ జారి పగల్లేదు''

''అది పగిలితే మీ గుండె పగిలిపోదూ ఈపాటికి! ఆ వెంటనే నా గుండె కూడా అనుకోండి.''

ముళ్ళమీద కూర్చున్నట్టుంది నాకు, యూఫోం సోఫామీదే కూర్చున్నా ఆ మాటల్ని వింటుంటే!

అన్నయ్య పెద్దగా నవ్వుతూ, ఆవిడ వెన్నుపై చేత్తో కొడుతూ ''ఏం జోక్ జోకేవ్ – అవునుగాని మనిద్దరి గుండెలు పగలడం చూసిన వీడి గుండెలు ఉంటాయిటే'' అన్నాడు ఇంకా నవ్వుతూ.

''నా జోక్‌కేంగాని – ముందు మీరు నవ్వకండి నా జోక్‌కి జోక్‌గలరు'' అంటూ పళ్ళు తేలుతున్న కప్పుని నా ముందుంచి; బెడ్‌రూంవైపు వెళ్ళేరు.

''అబ్బబ్బా-జోక్‌మీద జోక్‌వేసి చంపకే.''

''మరి నీకో! – అసలివేవిటో చెప్పనేలేదు'' అన్నాను. కప్పు క్రిందనున్న పొడుగాటి హేండిల్‌ని పట్టుకొని వోట్లోకి వో పండు పోనిస్తూ.

''నాకా – ఇప్పుడు మీ వదిన జోక్‌మీద జోక్ ఎందుకు వేసిందో తెలుసా, నోటి వాసనబట్టి! ఇందాకా ఇంటికొస్తుండగానే వో నాలుగౌన్సులు బిగించేను. ఇప్పుడీ పళ్ళు పడితే యింక నేను కంట్రోల్లో వుండను. అవి కూడా తీసుకో. ఈ మాత్రం తింటే ఏంచేయవు. కాస్తంత మైల్డ్‌గా వుంటుందంతే మరి నాలుగైదు పడితేగాని ఏం రంజుండదు. వాటికి 'ద్రాక్షాసవంలో నానేసిన ఆలివ్ పళ్ళు' అని అనువాదం చేసుకోవచ్చు గాని అంతా ఫారిన్ ఇంపోర్ట్! జపాన్‌మేడ్! అక్కడి ఆడంగులు తెగ మోజుపడి గుటుక్కు గుటుక్కుమని వీటిని మింగుతారట!

ఒరే నువ్వేం అనుకో, అంటే ఐమీన్ నువ్వేం అనుకున్నా నన్ను మాత్రం పల్లెత్తుమాట అనకూ అని నా అభిప్రాయం. కేవలం విను ...

లైఫ్‌ని ఎవరికోసమో రూయిన్ చేసుకోడం ఉత్తినాన్సెన్స్! ఇటీజ్ మై పోలసీ. కనీసం ఫేమిలీకోసం కూడా నా లైఫ్‌నీ, నా ఆనందాన్నీ నేను శాక్రిఫైస్ చేయను. ఇటీజ్ మై డిటర్మినేషన్! అస లెవడన్నా ఎందుకు చేసుకోవాలంటాను? ఈ విలువైన జీవితాన్నీ, ఈ అంతులేని అభిరుచుల్నీ వీలైనంతగా బ్రతికున్నంతకాలం అనుభవించక ఎవరికోసమో ఎందుకు మానుకోవాలి? నాకు తెలుసు. నీ దృష్టిలో లైఫ్ విలువ వేరని. కాని నాదృష్టి నాదే. అలా అని నన్నానుకొన్న వారెవ్వరికీ నేను అన్యాయం చేసి నేను పాయసాలు త్రాగడం లేదు. పైగా మరో ముఖ్య విషయం. నావల్లా, నా బలహీనతల వల్లా నన్నానుకొన్నవారు పాడైపోడం నేను టాలరేట్ చేయలేను. ఇందాకా నీవన్న పాయింట్ దగ్గిరికే వొస్తున్నా. నా పిల్లలు నా దగ్గరే వుంటే అంటే ఈ పొల్యూటెడ్ ఎన్విరాన్మెంట్ లోనే వుంటే ఇక వాళ్ళ గతి చెప్పక్కరలేదు. అందుకే దూరంగా ఎంతో దూరంగా వుంచేను.

నిజంగ నేను మనస్సాక్షిగా చెప్తున్నా. నాదీ నీదీ వొకే రక్తం. వొక్కొక అర్ధరాత్రి నా పిల్లల మమతలకోసం, నా పిల్లల చేతితాకిడి కోసం నేనెంత విల విల లాడిపోతానో నాకే తెలీదు. కాని, ఇలా అనుకొనే క్షణకాలాల్ని నేను కోరుంటే బలవంతంగా దూరం చేసుకొన్నాను, ఈ నా తీయని అందాల జీవితంపై నాకున్న మక్కువకొద్దీ!

ఇక్కడ మరో సంగతి తడవాల్సి వుంది. మరేం లేదు. నీ మనస్తత్వానికి తగిన భార్య నీకు జతపడినట్లే నా మెంటాలిటీతో సరిగా ఏకీభవించే భార్య నాకు దక్కింది.

ప్లీజ్. ఈ నా మాటల్లో వొక్క అక్షరాన్ని కూడా నువ్వు కామెంట్ చేయకు. ఇదంతా స్పృహతోనే మాట్లాడుతున్నా. నా మోతాదు ఐదున్నరౌన్సులు.

అదేవిటింకా రెండు పళ్ళు మిగిల్చేవు నిజంగానే ఎనిమిది దాటేదాకా ఏం చేయవు. నువ్వసలు నోరు మెదపకుండా వాటిని నోట్లో పడేసుకు చప్పరిస్తూ హాయిగా వెళ్ళిపడుకో.'' అని లేచి; మరో రెండు మాటలు చెప్పాల్సివుంది.

"నాకు పిల్లలపై మనసులాగా ఈ నీరెండ వెచ్చందనాలపై నువ్వెప్పుడు మనసుపడినా ఎలాంటి ఆరమరికా లేక రా, నాకు సంతృప్తి కల్గించు. అలాగే ఇందాకా ఏదో ఎకౌంట్ చెప్పేవు ... ఇంటికి వెళ్ళిన వెంటనే ఆ డిపాజిట్‌ను విత్‌డ్రా చేయి. ఇక నా కెప్పుడూ ఆ రకంగా బాధని కలిగించకు...ఎస్...ఇంక నే చెప్పేదేం లేదు. వెళ్ళి పడుకో" అంటూ బెడ్‌రూంలోకి వెళ్ళేడు.

కప్పులోవున్న వైన్‌తోబాటు రెండింటినీ నోట్లో వొక్కసారి పోసేసుకొని, బెడ్డింగు తీసుకొని పై అంతస్థు పైకి పోయేను. కలకత్తా వస్తే అక్కడే పడుకోడం నా అలవాటు.

వెన్నెల, కలకత్తా అందాలికి మెఱుగులు దిద్దుతోంది. దూరంగా ఆవైపు లీలగా కన్పించే హౌరా బ్రిడ్జినీ మెలికలు తిరిగిన నదినీ; ఈవైపు సుస్పష్టంగా కనిపిస్తున్న విక్టోరియా మెమోరియల్‌నీ; దిగూగా రోడ్లపై అర్ధరాత్రి అవుతున్నా ఆగని జన ప్రవాహాన్నీ వాహనాల్నీ చూస్తూ నిల్చున్నా, సిగరెట్ పొగల్ని వెన్నెల్లో కలుపుతూ.

"నాన్నా! మనం ఎప్పుడు ఇంటికి వెళ్ళిపోదామండీ."

త్రుళ్ళిపడి వెనక్కి తిరిగేను. శేఖర్?! "ఏం నాన్నా. దా. ఇంకా పడుకో లేదా?" అన్నాను దగ్గిరకి తీసుకొంటూ.

"ఇప్పుడే తెలివి వొచ్చింది. మీరు స్వెట్టర్ మర్చిపోయేరని తెచ్చేను."

"ఆరినీ. అయితే ఇంతసేపూ నాన్నా, నేనూ మాట్లాడు కొన్నవి విన్నావా?"

"లేదండీ. ఎందుకో ఇప్పుడే తెలివి వచ్చింది... రేపు ఇంటికి వెళ్ళిపోదాం."

"అదేవిఁటి నేనింకా నాలుగు రోజులు సెలవుపెట్టి వొచ్చేను. ఇండియన్ మ్యూజియం, బాలవిహార్, బొటానికల్ గార్డెన్స్-ఇంకా ఎన్నో చూడద్దూ?!"

"ఈసారి తమ్ముడూ వాళ్ళతో వొచ్చినప్పుడు చూద్దాం. ఇంటికి వెళ్లిపోదాం." అటు చూస్తూ అన్నాడు.

"సరే. నీ యిష్టం. వెళ్ళిపోదాం రేపే. వెళ్ళిపడుకో."

"నేనూ ఇక్కడే మీ దగ్గిర పడుకొంటాను."

"ఆరి రాస్కెల్! అదా సంగతి. దా. మరేం ఇవాళ నుంచీ నువ్వు నన్ను 'మీరు' అనిగాని 'అండీ' అనిగాని పిలవకూడదు. తెలిసిందా!" అన్నాను పక్కమీద పడుకొన్న వాడిమీద చెయ్యేసి పడుకొంటూ.

వాడి శరీరం నుంచి శ్రీనాథుడి శరీర స్పర్శ నా శరీరంలోకి వెన్నెలకన్నా నున్నగా సుతిమెత్తగా ప్రసరిస్తోంది!

వికటకవి

డా. తంగిరాల

గురజాడ అకవి
రాయప్రోలు సుకవి
తుమ్మల కాంగ్రెసు కవి
విశ్వనాథ ఆరెస్సెసు కవి
కృష్ణశాస్త్రి బ్రహ్మసమాజ కవి
శ్రీశ్రీ సమసమాజ కవి
పఠ్మాభి ఫ్రాయిడ్ కవి
ఆరుద్ర బఫూన్ కవి
తిలక్ కుందుర్తులు సోషలిస్టులు
దిగంబరులు అనార్కిస్టులు
విరసంవారు నక్సలైట్లు
అరసంవారు అపర్చూనిస్టుల
దాశరథి సర్కారుకవి
సినారె సినీమాకవి
శేషేంద్ర జనతాకవి
(ద్వంద్వ సభ్యత్వం చర్చనీయాంశం)
కొందరు కవులు ఆత్మకవులు
మరికొందరు అయోమయం కవులు
'ఛ ఛ నేను ఏదీ కాదు' అన్నకవి
నిజంగా వికటకవి!